




పులికల్లు పంచాయతీకి అవార్డులు



ప్రజాశక్తి -పొదలకూరు మండలంలోని పులికల్లు పంచాయతీకి జిల్లాస్థాయి ఉత్తమ అవార్డు లభించింది. మండల స్థాయిలో మరో నాలుగు అవార్డులు పొందింది. జిల్లాస్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయత్ అవార్డు సాధించింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ అవార్డులను ప్రకటించారు. జిల్లాస్థాయి అవార్డును సోమవారం నెల్లూరులో జరిగే సమావేశంలో జిల్లా కలెక్టర్ అందజేయనున్నారు. పులికల్లు సర్పంచ్ జి.వి. సుబ్బమ్మ, కార్యదర్శి మాధవి ఈ అవార్డు అందుకోనున్నారు. మండల స్థాయిలో చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు, వాటర్ సఫిషియెంట్ పంచాయత్, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయత్, సెల్ఫ్ సఫిషియెంట్ పంచాయత్ అవార్డులను పొందింది. సర్పంచ్ జి.వి. సుబ్బమ్మ,కార్యదర్శి మాధవి మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రోత్సాహం, సహాయ సహకారాలతో పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. అవార్డుల సాధనలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగు భాష సిగ్గుపడుతోంది..!

తెలుగు భాష కమ్మగా ఉంటుంది...56 తెలుగు అక్షరాలు.. పదాలు.. పాటలు.. మాటలు.. అమృతంలా ఉంటాయని చెబుతుంటారు. అలాంటి తెలుగు భాష సిగ్గుపడే తలదించుకునేలా మారుతోంది. ఇటీవల రాజకీయ నేతలు సోషల్ మీడియా వేదికగా బూతు సంస్కృతికి తెరలేపారు. అధికార, ప్రతిపక్ష పార్టీ నేతలు పత్రికల్లో రాయలేని భాషలతో విరుచుకు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు సహనం కోల్పోయి ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారు. దొంగ నా కొ...నీ అ...చెప్పు...ఇలా ఎలా పడితే అలా భాషను ఒడు కుంటున్నారు. సెల్ ఫోన్ చేతిలో ఉండి, నెట్ ఉన్న ప్రతి ఒక్కరు ఈ భాషను చూసి తలదించుకుంటున్నారు. చిన్నారు చెవులు నిక్కపొడుచుకుని వింటున్నారు. భావి తరాలకు మన నేతలు కొత్త భాష, సంస్కృతిని పరిచయం చేస్తున్నారు.. భాష సరిగా లేకపోవడంతో కొడవలూరులో ఉద్రిక్తలు నెలకున్నాయి. వైసిపి, టిడిపి నేతలు దాడులు చేసుకునే పరిస్థితికి వచ్చారు.

- ○రాజకీయాల్లో బూతు సంస్కృతి
- ○సోషల్ మీడియా వేదికగా కవ్వింపులు
- ○కొడవలూరులో ఉద్రిక్తత

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు రాజకీయాలకు పెట్టింది పేరు. ఇక్కడ నుంచి రాష్ట్ర, దేశ స్థాయిలో నేతలు ఎదిగారు. మన భాష, సంస్కృతిని పరిచయం చేశారు. పుచ్చలపల్లి సుందరయ్య, బెజవాడ గోపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆనం ఇలా ఎందరో రాజకీయాల్లో ఉన్నారు. ప్రజా సమస్యలపై మాట్లాడేవారు. రాజకీయంగా విమర్శలు చేసు కునేవారు. అవి ఎంతో బాధ్యతాయుతమైన విమర్శలు గానే ప్రజలు చూసేవారు. మీడియాను చూసి చిన్న తప్పు మాట మాట్లాడాలన్న భయ పడిపోయే పరిస్థితులు ఉండేవి. మీడియా కూడా ఎలాంటి అనాగరిక భాషను వాడేవి కావు. ఇటీవల రాజకీయ నేతలు కంట్రోల్ తప్పి మాట్లాడుతున్నారు. ఇటీవల సోషల్ మీడియా వ్యాప్తి కనీసం ఎడిటింగ్ లేకపోవడంతో ఏది పడితే అది మాట్లాడుతున్నారు. అది నేరుగా ప్రజల్లోకి వెళుతున్నాయి. నెల్లూరు జిల్లాలో ఇటీవల కాలంలో రాజకీయాల్లో మరీ ఎక్కువైపోయాయి. వైసిపి నేతలు, టిడిపి నేతలు అటు, ఇటుగా మాట్లాడుతున్నారు. తెలుగు భాషలో ఇన్ని బూతులున్నాయని అని ఆశ్చర్యపోవాల్సి వస్తుంది. ఇటీవల నెల్లూరు నగర ఎంఎల్ఎ పి. అనిల్‌కుమార్ యాదవ్ పదే పదే సహనం కోల్పోతున్నారు. తనపై మీడియాలోనూ, ఇతర పార్టీలు ఏమైనా విమర్శ:లు చేస్తే, దానికి ప్రతిగా మీడియా వేదికగా ఊగి పోతున్నారు. "నా కో...ఒక అమ్మ, అబ్బకు..మీ అంతు చూస్తా,..,. చెంపేస్తా " ఇలా బెదిరింపులకు దిగుతున్నారు. తమ నేతే ఇలా మాట్లాడుతుండడంతో తామేమి తక్కువ కాదంటూ కింది స్థాయి నేతలు సైతం బూతులు పురాణాలు అందుకుం టున్నారు. సీనియర్ రాజకీయనేత, ఎంతో గుర్తింపు ఉండి, ఆరుసార్లు ఎంఎల్ఎగా గెలిచిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి సహనం కోల్పోయి మాట్లాడు తున్నారు. కొందరు సోషల్ మీడియాలో అవాస్తవాలు, అబద్ధాలు ప్రచారం చేయడమే దీనికి కారణం. మీడియాతో ప్రశాంతంగా జరిగింది చెప్పవచ్చు. అలా కాకుండా బూతులు అందుకొని రెచ్చిపోతు ఒడడంతో రాజకీయాలపై ప్రజలకు హేవగింపు కలుగుతోంది. రాజకీయాల్లో పెద్ద చిన్న చూడడం లేదు. గౌరవ మర్యాదలు పట్టించుకోవడం లేదు. నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారు. సర్వేపల్లి కేంద్రంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిలు రాజకీయ విమర్శలు చేసుకుం టున్నారు. ఇటీవల కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమిరెడ్డిని ఉద్దేశించి మీడియాలో నోరు జారారు. అందుకు ఆయన పచ్చాతపపడినట్లు తెలిసింది. ఇలాంటి భాష మాట్లాడి ఉండకూడదని తన అనుచరుల వద్ద అన్నట్లు తెలిసింది. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు సహజమే. ఇదిలా ఉంటే ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని వైసిపి సస్పెండ్ చేసిన సమయంలో ఆయన జగన్, వైసిపి నేతలపైనా అవాకులు, చవాకులు పేలారు. నీచమైన భాషలో తిట్టారు. ఇవి కనీసం ఎడిటింగ్ లేకుండా మీడియాలో ప్రసారం అయ్యాయి. కావలిలో ఎంఎల్ఎ రామ్‌రెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఇటీవల నోరు జారారు. ఇప్పుడిప్పుడే రాజకీయాల్లోకి వస్తున్న పోలంరెడ్డి దినేష్‌రెడ్డి చిన్న, పెద్ద లేకుండా ప్రసన్నకుమార్‌రెడ్డిని 'నీ నాలుక కోస్తా' అంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు కొడవలూరులో నువ్వా.. నేనా అన్నట్లు మారింది. రాజకీయ నేతలు మధ్యలో ప్రజలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్నారు...



టిడిపి నేతకు హెచ్చరికలు జారీ చేస్తున్న వైసిపినేత వీరి చలపతి

కొడవలూరులో ఉద్రిక్తతలు..

నోరు బాగుంటే ఊరు బాగుంటుంది.. అంటారు. ఇప్పుడు రాజకీయ పార్టీ నేతలు నోరు జారడంతో కొడవలూరులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం ఉదయం వైసిపి నేత వీరి చలపతి రాజుపాళెం ఆటో స్టాండ్‌వద్ద ఆందోళన నిర్వహించి పోలంరెడ్డి దినేష్‌రెడ్డికి వార్నింగ్ ఇచ్చారు. బూతులతో చలరేగిపోయారు. ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. అంతు చూస్తానని, చెంపేస్తానని, పత్రికల్లో రాయలేని భాషతో చెలరేగిపోయారు. ఇదే సమయంలో మహిళలతో మీడియాలో మాట్లాడించి, వివాదం మరింత పెరిగేలా చేశారు. ఆదివారం సాయంత్రం రాజుపాళెంలో పోలంరెడ్డి దినేష్‌రెడ్డి తన అనుచరులతో ఆందోళనకు దిగారు. ఎంఎల్ఎపై రెచ్చిపోయారు. ఏమి జరుగుతుందో తెలియక ఉద్రికత్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి దినేష్‌రెడ్డిని, ఆయన అనుచరులను అరెస్ట్ చేసి పోలీసుల స్టేషన్‌కు తరలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ కొడవలూరు పోలీస్టేషన్‌కు వెళ్లి పరామర్శించారు. సొంత పూచీకత్తుపై పోలీసులు టిడిపి నేతలను విడుదల చేశారు. నోటి మాట ముదిరి కోవూరులో ఎప్పుడు ఏం జరుగుతుందోననే ఆందోళ నకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. రాజకీయాల్లో బూతుల సంస్కృతి ఎటు వైపు తీసుకెళుతుందో చూడాలి.



టిడిపి నేత దినేష్‌రెడ్డిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ఉదయగిరి నుంచి 'ఆదాల' వెనక్కి..!

- ○రచనారెడ్డి, వంశీరెడ్డి పోటీకి విముఖత
- ○'సజ్జ'లతో సమావేశం రద్దు
- ○ఆశావావుల్లో మళ్లీ ఆశలు
- ○రసవత్తరంగా ఉదయగిరి రాజకీయం

ఉదయగిరి రాజకీయం మళ్లీ ఆసక్తిగా మారింది. ఆదివారం ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో జరగాల్సిన మేకపాటి, ఆదాల కుటుంబ సమావేశం రద్దు చేసుకున్నారు. 2024 లో ఉదయగిరి నుంచి ఆదాల రచానారెడ్డి, ఆదాల వంశీకృష్ణారెడ్డి ఎవరో ఒకరు పోటీ చేస్తారని భావించారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి తమ కుటుంబ ప్రాతిధ్యాన్ని నింపాలని చూశారు. పరిస్థితుల నేపథ్యంలో ఇద్దరు పోటీ చేయడానికి విముఖత వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ నుండి టికెట్ ఆశిస్తున్న నలుగురు నేతలకు మళ్లీ ఆశలు చిగురించాయి.

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

ఉదయగిరి రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. 1983 నుంచి మేకపాటి రాజమోహన్‌రెడ్డి కుటుంబం ఉదయగిరిలో తమ ప్రాభల్యం చూపుతోంది. ఆయన సోదరుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని ఇటీవల వైసిపి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నలుగురు నేతలు ఈ స్థానం నుండి పోటీ చేయడానికి తహతహలాడుతున్నారు. ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. తమ కుటుంబం నుంచి ఉదయగిరి చేజారుతుందని భావించిన మేకపాటి రాజమోహన్‌రెడ్డి ఇటీవల సిఎం జగన్‌ను కలిసిన సందర్భంగా మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి కుమార్తె, ఆదాల రాఘవరెడ్డి కోడలు ఆదాల రచనారెడ్డి పేరు ప్రతిపాదించినట్లు తెలిసింది. గతంలోనే గౌతమ్‌రెడ్డి భార్యను తీసుకురావడానికి సమస్యలొచ్చాయని, ఆదాల వంశీకృష్ణారెడ్డి ఎలా ఉంటారని ముఖ్యమంత్రి చెప్పినట్లు. సమాచారం. ఈ నేపథ్యంలో ఒకసారి కూర్చోని మాట్లాడి తనకు చెప్పాలని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు తెలిసింది. శనివారం మేకపాటి రాజమోహన్‌రెడ్డి హైదరాబాద్ వెళ్లారు. రంజాన్‌కావడంతో సజ్జల ఆదివారం కూర్చుందని చెప్పినట్లు సమాచారం. ఆదివారం మేకపాటి రాజమోహన్‌రెడ్డి హైదరాబాద్‌లో ఆదాల రచనారెడ్డి, ఆదాల వంశీకృష్ణారెడ్డితో కూర్చొని మాట్లాడినట్లు తెలిసింది. కారణాలు ప్రత్యేకంగా తెలియడం లేదు కాని .. ఉదయగిరి నుంచి పోటీ చేయడానికి ఆ ఇద్దరు వెనక్కి తగ్గినట్లు తెలిసింది. నిన్నటి వరకు ఆసక్తిగా ఉన్న భార్య, భర్తలు ఇప్పుడు వెనక్కి వెళ్లడం పట్ల మేకపాటి, ఆదాల వర్గీయులు అవాక్కయ్యారు. ఇప్పటికే ఉదయగిరిలో మెట్టుకూరు ధనంజయరెడ్డి, మెట్టుకూరు చిరంజీవి రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, చేజర్ల సుబ్బారెడ్డి నేనంటే నేను అంటూ పోటీలో ఉన్నారు. మేకపాటి, ఆదాల కుటుంబ వారసులను వ్యతిరేకిస్తున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో కుటుంబాన్ని, ఇద్దరు చిన్న పిల్లలను వదిలి వెళ్లాలని అని రచనారెడ్డి, కాంట్రాక్ట పనులు వదిలి హైదరాబాద్ నుంచి ఉదయగిరి వెళ్లాలా అనే అనుకున్నారని.. అందుకే పోటీకి విముఖత వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఇందుకు బలమైన కారణాలు ఉన్నాయా అనే అనుమానాలున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని రాజమోహన్‌రెడ్డి ఫోన్ ద్వారా సజ్జలకు తెలిపినట్లు తెలిసింది. ముఖ్యమంత్రికి ఇదే విషయం చెబుతానని చెప్పినట్లు తెలిసింది. ఆశావాహుల ఆశలు మళ్లీ ఇప్పుడు చిగురించాయి. ఉదయగిరి నుంచి ఎవరు బరిలో ఉంటారోననే ఆసక్తి అందరిలో నెలకొంది. ఎవరి ప్రయత్నాలు వారు మొదలు పెట్టారు.



ఆదాల వంశీకృష్ణారెడ్డి



ఆదాల రచనారెడ్డి

మోడీని గద్దె దించాలి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలో ప్రచార భేరిలో భాగంగా 2వ రోజు ఆదివారం ఆటో జాత సాగింది. సిపిఎం మండల కార్యదర్శి వేగురు వెంకయ్య, పచ్చ మధు కాల్తీరెడ్డి రవణమ్మ, మారుబోయిన రాజ మాట్లాడారు. విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మోసం చేసిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో 2014 ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి దగా చేసిన బిజెపి పునరలోచించు కోవాలన్నారు. సిపిఎం పేడూరు శాఖ కార్యదర్శి ఈపూర్ లక్ష్మయ్య, ఆటో యూనియన్ వర్కర్స్ నాశిన వెంకటేష్, బాషా, రాదయ్య, రైల్వే గుడ్సెషెడ్ ముఠా వర్కర్స్, మేరబోయిన వెంకట శేషయ్య, గిరి, రషీద్, సుబ్రహ్మణ్యం, సునీల్, నాగరాజా, నాగేంద్ర, హరీష్ పాల్గొన్నారు.

ప్రచార భేరి
ఏప్రిల్ 14 నుంచి 30 వరకు



పాము కాటుతో యువకుడి మృతి

ఆలస్యంగా వెలుగులోకి...

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : పాము కాటుతో ఓ యువకుడు మతి చెందాడు. పోలీసులకు మతుని తల్లి నామతాటి విజయమ్మ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మండలంలోని ఇస్కపాలెం దళితవాడకు చెందిన కార్తీక్ (31) ఈ నెల 14న ఇంట్లో పాముకాటుకు గురయ్యాడు. దాంతో కుటుంబ సభ్యులు నాటు వైద్యం కోసం స్థానికంగా ఉన్న పాముల వారి వద్దకు తీసుకెళ్లారు. అయితే కార్తీక్ ఆరోగ్యం విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ఓ ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించారు. అయినప్పటికీ ఆరోగ్యం కుదుట పడకపోగా మరింతగా విషమించి ఈ నెల 22వ తేది మతి చెందాడు. కార్తీక్ మత దేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె. ఇంద్రసేనా రెడ్డి తెలిపారు. పాముకాటుతో మతి చెందిన కార్తీక్ కు ఇటీవల వివాహం అయినట్లు తెలిసింది.

యువకుడి హత్య

ప్రజాశక్తి-నెల్లూరు

రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లీం మైనార్టీ సోదరులు తమ కుటుంబ సభ్యులతో కలిసి మసీదులకు వెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేసుకొని ఒకరిని మరొకరు అభినందించుకుంటూ సంతోషంగా ఉన్న సమయంలో శనివారం అర్ధరాత్రి సమయంలో జనార్ధన్‌రెడ్డి కాలనీ ప్రాంతంలో మద్యం మత్తులో యువకుడి హత్య ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు ఈ హత్యకు సంబంధించిన వివారాలు ఇలా ఉన్నాయి. మద్యం మత్తులో యువకుల మధ్య నెలకొన్న చిన్నపాటి వివాదం హత్యకు దారి తీసిందంటున్నారు. మాబుల్లా అనే యువకుడిని మరో యువకుడు కత్తితో దాడి చేయడంతో ఘటనా స్థలం వద్దనే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకొని కత్తితో దాడి చేసిన ఘటనతో సంబంధం ఉన్న మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు.



చిత్రపటం అందజేస్తున్న నాయకులు

ఉద్యమ నేత 'రామసుబ్బారెడ్డి'

ప్రజాశక్తి-నెల్లూరు

సిఐటియు జిల్లా కార్యాలయానికి సిఐటియు మాజీ అధ్యక్షులు ,తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన మహనీయులు డి.రామసుబ్బారెడ్డి చిత్రపటాన్ని తపాల ఉద్యోగుల సంఘం ఎన్ఎఫ్‌పిఇ నాయకులు అందజేశారు. ఆదివారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయానికి చేరుకున్న తపాల ఉద్యోగుల సంఘం నాయకులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు రామసుబ్బారెడ్డి చిత్రపటం సిఐటియు కార్యాలయంలో ఉంచాలనే ఆశయం నేటితో నెరవేరిందని, ఉద్యోగులకు సిఐటియు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎఫ్ పిఇ సీనియర్ నాయకులు ఏ.వి.కష్ణయ్య,పి4 కార్యదర్శి సిహెచ్.వెంకయ్య, పి4 అధ్యక్షులు యు.పెంచలయ్య,బి. శ్రీనివాసులు,కె. శివ నాగరాజు,యస్. వెంకటేశ్వర్లు,సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కూల్చివేత

కల్లూరుపల్లిలో ఉద్రిక్తత
సిపిఎం నాయకుల అరెస్టు, గృహ నిర్బంధం
అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసన



జెసిబితో గుడిసెలు తొలగిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు రూరల్ నియోజ కవర్గంలో పేదల గుడిసెలు కూల్చివేతతో ఉద్రిక్తత నెలకొంది. సమాచారం లేకుండా ఇళ్ల కూల్చివేతకు అధికారులు శ్రీకారం చుట్టడంతో పేదల అరుపులు, నిరసనలతో ఆ ప్రాంతం మిన్నంటింది. వారికి అండగా నిలిచే సిపిఎం నాయకులను ముందస్తు అరెస్టు చేసి పోలీస్టేషన్‌కు తరలించారు.

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీ వద్దనున్న కొత్తచెరువులో 2 వేల మంది నిరుపేద కుటుంబాలు నెల కిందట గుడిసెలు వేసుకున్నారు. వాటిని ఇరిగేషన్ అధికారులు కార్పొరేషన్ అధికారులు, పోలీసుల సాయంతో ఆదివారం తొలగించారు. పేదలు వైసిపి రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని కలిసి జగనన్న కాలనీల్లో తమకు నివాస స్థలాలు ఇవ్వలేదని, ఆ ప్రాంతంలో పట్టాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు చెరువును ఆక్రమించినట్లు స్థానిక వేదాయపాళెం పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వాటిని తొలగించేందుకు జెసిబి వాహనాలతో అక్కడకు చేరుకున్నారు. దీంతో పేదల అరుపులు, నిరసనలు మిన్నంటాయి. పేదలకు అండగా నిలిచే సిపిఎం నాయకులను బాలాజీనగర్ పోలీసు స్టేషన్ సిబ్బంది ముందస్తుగా అరెస్టు చేశారు. సిపిఎం నాయకులు జి.నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, సిపిఎం రూరల్ కార్యదర్శి బత్తల కృష్ణయ్య, పలువురు డివైఎఫ్ఐ నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, అల్లాడి గోపాల్ తదితరులను గృహ నిర్బందం చేశారు. స్థానిక వైసిపి కార్పొరేటర్‌నూ పోలీసులు గృహ నిర్బందం చేశారు. ఈ కార్పొరేటర్ రూరల్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వర్గానికి చెందిన వారు కావడం విశేషం.

అక్రమ అరెస్టులు దుర్మార్గం : సిపిఎం

సిపిఎం నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. పోలీసుల అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిపిఎం కార్యాలయం నుంచి మినిబైపాస్ రోడ్డు సమీపంలోని పూలే దంపతుల విగ్రహం వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడారు. కల్లూరుపల్లి వద్ద పేదల ఇళ్లను సమాచారం లేకుండా తొలగిం చడాన్ని ఖండించారు. ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో స్థలాలు పంపిణీ చేసినప్పటికీ తమకు స్థల కేటాయింపు జరగలేదని కొంత మంది పేదలు ఓ కబ్జాదారుడు ఆక్రమించిన స్థలంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నా రన్నారు. కలెక్టర్ విచారణ జరిపి అర్హులైన పేదలకు స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన సిపిఎం నాయకులను విడుదల చేయాల న్నారు. సిపిఎం సీనియర్ నాయకులు పులిగండ్ల శ్రీరాములు, జొన్నల గడ్డ వెంకమరాజు, సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. సిపిఎం నాయకులు అరెస్టులను ఖండిస్తూ సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్ ఆధ్వర్యంలో అయ్యప్పగుడి సెంటర్‌లో నిరసన చేపట్టారు. కొండా ప్రసాద్, షేక్ ఖాలేషా మాట్లాడారు.



నగర కమిటీ ఆధ్వర్యంలో పూలే సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం రూరల్ కమిటీ నిరసన

పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించిన సిపిఎం నాయకులను భేషరతుగా విడుదల చేయాలని సిపిఎం రూరల్ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం అయ్యప్పగుడి సెంటర్‌లో సిపిఎం రూరల్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం నెల్లూరు రూరల్ కార్యాలయం మన్సూర్ భవన్ నుంచి ప్రదర్శన చేపట్టారు. నలపరెడ్డి శ్రీనివాస్ రెడ్డి బొమ్మ మీదుగా వేదయపాలెం బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్దకు చేరుకొని అక్కడ నిరసన చేపట్టారు. అక్కడ సభ జరిగింది. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదల ఇళ్లనుతొలగించడం దారుణ మన్నారు. కల్లూరుపల్లి వద్ద ఇల్లు వేసుకున్న పేదలందరికీ తక్షిణం గుర్తించి అర్హులైన వారందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కామ్రేడ్ బత్తల కష్ణయ్య మాట్లాడుతూ పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు రుణాలు మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. సిపిఎం నెల్లూరు రూరల్ కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ కిన్నెర కుమార్ మాట్లాడుతూ పేదలు ఇళ్లను కూల్చడం చాలా అన్యాయమన్నారు.సిపిఎం రూరల్ సెక్రటేరియట్ సభ్యులు కొండా ప్రసాద్ ,రూరల్ కమిటీ సభ్యులు ఎస్ డి రఫీ అహ్మద్, వీర్ల శ్రీనివాసులు, కాలేషా, కామ్రేడ్ దేవతాటి సంపత్ కుమార్, ఎం సుధాకర్, శాఖ కార్యదర్శులు కరేటి నరసయ్య, ఒంగోలు సుధీర్, ఇళ్ల స్థలాల పోరాట కమిటీ సభ్యులు వంకదారి శ్రీనివాసులు, తరుణ్ ,మదన్, వేమాలమ్మ , రాజమ్మ,మల్లీ కార్జున, పెంచలయ్య ఆవాజ్ నెల్లూరు రూరల్ కార్యదర్శి ఎస్ డి .మీరా పాల్గొన్నారు.



రూరల్ కమిటీ ఆధ్వర్యంలో..

డివైఎఫ్ఐ ఖండన

కల్లూరుపల్లి ప్రాంతంలో పేద ప్రజలు వేసుకున్నటువంటి ఇంటి పాకలను తొలగించి సిపిఎం నాయకులను నిర్బంధించి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని డివైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు



సిపిఎం నాయకుడిని బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు



మాట్లాడుతున్న ఎఐవైఎఫ్ నాయకులు

పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

స్థానిక 54 డివిజన్ వెంకటేశ్వర జనార్ధన్ రెడ్డి కాలనీలో పోలీసు అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ షేక్ మున్నా డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా షేక్ మున్న మాట్లాడుతూ వెంకటేశ్వర జనార్ధన్ రెడ్డి కాలనీ 54 డివిజన్ 2 టౌన్ పరిధిలో ఉందన్నారు. అయితే ఈ ప్రాంతంలో ఆకతాయిల బెడద అధికంగా ఉండటం వల్ల స్థానికులు భయప్రాంతానికి గురి అవుతున్నారన్నారు. కనీసం ఆటో ఎక్కాలన్నా ప్రజలు భయాందోళనలకు గురౌతున్నారన్నారు. రౌడీ షీటర్లతో గంజాయి, సొల్యూషన్ వంటి మత్తు పదార్థాలు సేవించి యువత చెడు వ్యసనాలకి బానిసలౌతున్నారన్నారు. పదేళ్ల పిల్లోడితో సహా మాదక ద్రవ్యాసేవనం చేసి ఒక్క చిన్న గొడవ వచ్చినా కత్తులు తీసుకొని పొడుచుకునే పరిస్థితికి దిగజారి పోయారన్నారు. ఎస్పి కె.తిరుమలేశ్వరరెడ్డి వెంటనే స్పందించి వెంకటేశ్వర జనార్ధన్ రెడ్డి కాలనీ భగత్ సింగ్ కాలనీ టీట్కో గహాలు ఇస్లాంపేట, అలీ నగర్, రైల్వే వీధి, వెంకటేశ్వర పరిధిలో అవుట్ పోలీస్ స్టేషన్ పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు సర్దార్, సుల్తాన్, కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు

25న వెంకయ్యనాయుడు రాక

ప్రజాశక్తి-నెల్లూరు

ఈ నెల 25వ తేది నుంచి 28వ తేది వరకు నాలుగు రోజుల పాటు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు జిల్లాలో పర్యటించనున్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రైలు మార్గం ద్వారా చార్మినార్ ఎక్స్ ప్రెస్ లో నగరానికి చేరుకోనున్నారు. అక్కడ నుంచి వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ కు చేరుకుని అక్కడే బస చేస్తారు. సాయంత్రం సరస్వతి నగర్‌లోని అక్షర విద్యాలయం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న 'అక్షర ఉదయం' కార్యక్రమంలో హాజరు కానున్నారు. ఏప్రిల్ 26 ఉదయం ఆత్మకూరులోని శ్రీధర్ గార్డెన్స్ కళ్యాణమండపంలో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు ఆత్మకూరులోని బి.ఎస్.ఆర్. సెంటర్ లో ఏర్పాటు చేసిన శ్రీ బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఏప్రిల్ 27న స్వర్ణభారత్ ట్రస్ట్ లో బస చేసి, ఏప్రిల్ 28న మధ్యాహ్నం రైలు మార్గంలో నెల్లూరు నుంచి విజయవాడ పయనం అవుతారు.

ఇళ్ల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు

మండలంలోని కల్లూరుపల్లి వద్ద పేదల ఇళ్లు తొలగించడం అన్యాయమని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా పేర్కొన్నారు. పేదల ఇళ్ల తొలగింపును ఆయన ఖండించారు. పాకలను తొలగించి సిపిఎం నాయకులను నిర్బంధించి అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

విగ్రహావిష్కరణకు ముమ్మర ఏర్పాట్లు

- పలువురు ప్రముఖులు రాక

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : బుధవారం 26వ తేదీన ఆత్మకూరు మాజీ ఎంఎల్ఎ, డాక్టర్ బి.సుందర్ రామిరెడ్డి విగ్రహావిష్కరణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు, ప్రతిష్ఠాత్మక హాజరైన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ జెడ్పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని వారి స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తమ తండ్రి డాక్టర్ సుందర్ రామిరెడ్డి 2022 ఫిబ్రవరి 6వ తేదీన దివంగతులయ్యారని తెలిపారు. డాక్టర్ సుందర్ రామిరెడ్డి వైద్య పరంగా ప్రజలకు ఎంతో సేవ చేశారని, రాజకీయపరంగా మచ్చలేని నాయకుడిగా మంచిపేరు ప్రతిష్టలు సంపాదించారన్నారు. ఈ స్థలం కేటాయించిన ఆత్మకూరు శాసనసభ్యులు, మున్సిపల్ కమిషనర్కి, మున్సిపల్ చైర్మన్కి కృతజ్ఞతలు తెలియజేశారు. పట్టణ ప్రజలు అభిమానులు శ్రేయోభిలాషులు ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సుందర్ రామిరెడ్డి మనుమడు బొమ్మిరెడ్డి తారకనాథ్ రెడ్డి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజా రెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, టిడిపి రూరల్ కార్యదర్శి కేత విజయభాస్కర్ రెడ్డి, యువ నాయకులు పికెకిటి వెంకటేశ్వర్లు నాయుడు, గోరి షబ్బీర్, విశ్రాంతి ఉపాధ్యాయులు సాదక్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-వరికుంటపాడు : స్థానిక బస్టాండ్ సెంటర్లో ఆదివారం జనసేన నాయకులు మజ్జిగ చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని నాయకులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండల పార్టీ కన్వీనర్ పఠాన్ రసూల్ సూచనల సలహాల మేరకు పార్టీ మండల కార్యదర్శి గోను కొండయ్య ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేసిన పార్టీ స్ఫూర్తితో సంస్థ నాయకుని లక్ష్యాన్ని ముందుకు తీసుకుపోతున్నారు. మండల నాయకులు కెవికె రాఘవేంద్ర, మండల యువనాయకులు మస్తాన్ నిఖిల్ యాదవ్, వేణు, నవీన్, యలమందల నాగార్, శరణయ్య, జనసైనికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బిట్రగుంట : బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ వారి సహకారంతో బోగోలు బజార్ సెంటర్ అవుట్ పోస్ట్ పోలీస్ స్టేషన్ వద్ద ఆదివారం బిట్రగుంట పోలీస్ స్టేషన్ ఇన్ఛార్జి ఎస్ఐ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు ఆర్ శశి కుమార్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను మంచి పనులు చేసేందుకు బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎప్పుడు ముందుంటారని తెలిపారు. అసోసియేషన్ తరఫున మెడికల్ క్యాంపును కూడా నిర్వహించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఏకే సుందర్ రాజ్, ట్రెజరర్ చిప్పాడి రవి, ఉమా మహేశ్వరరావు, గుత్తి ప్రభాకర్, ఎండోటి రామయ్య, పేట శ్రీధర్, బర్ల్ డి శేఖర్, బత్తుల రవి, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి బియ్యం వితరణ

ప్రజాశక్తి-కావలి : అతిథి హోటల్ నిర్వాహకులు అర్వపల్లి నాగరాజ సతీమణి అర్వపల్లి సుజన, పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం కావలి పట్టణం తుఫాన్ నగర్ కొత్త శివాలయం వెనుకాల ప్రమాదం కారణంగా మంచానికి పరిమితమైన శ్రీను అనే నిరుపేదలకు సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో 25 కిలోల బియ్యం బస్తా అందజేశారు. కార్యక్రమంలో దాతలు అర్వపల్లి నాగరాజ - సుజన దంపతులు పాల్గొని అందజేశారు.

గ్రీన్హ్యాండ్స్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి-కావలి : వేసవికాల విపత్తు ఉపశమన చర్యల్లో భాగంగా, స్వచ్ఛంద సంస్థల సహకారంతో బస్టాండ్లోని ప్రయాణికులకు ఆదివారం మంచినీరు, మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు ఎపిఎస్ ఆర్టీసి కావలి డిపో మేనేజర్ రాఘురాం శ్రీనివాసులు తెలిపారు. గ్రీన్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ హ్యాండ్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వేమూరి గాయత్రి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గతంలో బస్టాండ్ ఆవరణంలో మొక్కలు నాటడంతో పాటు సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో వి.శ్రీలేఖ, విజయ, రజని, శ్రీలత, పద్మ, నిహాల్, స్నేహశ్రీ, ఆర్టీసి అసిస్టెంట్ మేనేజర్ కెవిఆర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా అభివృద్ధి పనులు



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల అభివృద్ధి పనులపై మాజీ.పద్మజానంద్రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి మండల అభివృద్ధి కార్యాలయ ప్రహరీలు ప్లాంటేషన్ అభివృద్ధి పనులు ముమ్మరం చేశారు. ఆదివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయానికి నూతన హంగులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిపి నిధులతో మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని ప్రహరీలు ప్లాంటేషన్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి గొల్లపల్లి తిరుపతయ్య, మాజీ మండల కన్వీనర్ మాలే సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ అక్కులరెడ్డి, నాయకులు ఇత్తడి రమణయ్య, యువ నాయకులు పవన్ కుమార్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పుస్తక దినోత్సవం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు దొర్నాదుల సుబ్బమ్మ రామిరెడ్డి స్మారక శాఖ గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమాన్ని గ్రంథపాలకురాలు శ్రీనివాసరాజు నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకం ప్రాధాన్యతను వివరిస్తూ ప్రపంచాన్ని మార్చే గొప్ప శక్తివంతమైన ఆయుధం పుస్తకం అని, పుస్తక పఠనం నిజమైన విజ్ఞానవంతుల్ని చేస్తుందని, పుస్తకాలు చదవడం ద్వారా జ్ఞానంతో పాటు విలువైన ఊహా శక్తి కలుగుతుందని తెలియజేశారు. గ్రంథాలయ పాఠకులు, అసిస్టెంట్ ఎల్.ఈనాఖ, తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ధ్యానం చేయడం వల్ల శారీరక మానసిక రుగ్మతలు పోయి ఆరోగ్యంగా జీవించవచ్చని పిరమిడ్ మాస్టర్.పోలకా తిరుపతిరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీ షిరిడీ సాయి పిరమిడ్ ధ్యాన మందిరంలో ఆధ్యాత్మిక శాస్త్రం 6 సిద్ధాంతాల గురించి వివరించారు. ధ్యానం వల్ల ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఎం.వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

'ఎస్ఎస్వి' సిల్వర్జూబ్లీ వేడుకలు



ప్రజాశక్తి-నెల్లూరు : నెల్లూరు నగరంలోని 11వ డివిజన్ ఎన్టిఆర్ నగర్లో ఉన్న ఎస్.ఎస్.వి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం త్యాగరాజ కళ్యాణ మండపంలో విద్యార్థుల నృత్యాలు చేస్తూ ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 11, 14వ డివిజన్ల కార్పొరేటర్లు గోతం అరుణ బాలకృష్ణ, కర్తం ప్రతాప్ రెడ్డి, స్టేట్ ప్రయివేట్ స్కూల్ ప్రెసిడెంట్ అన్వర్ భాషా పాల్గొని మాట్లాడారు. పిల్లలకు విద్య చాలా అవసరం అని, విద్య వల్ల సమాజంలో గౌరవ మర్యాదలు, పిల్లలు కూడా చదువు వల్ల ఉన్నతమైన స్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. స్కూల్ చైర్మన్ ఎస్.సుబ్బయ్య ఒక చిన్న తరగతి కుటుంబం నుంచి వచ్చి ఈ ప్రాంతంలో ఉంటూ 25వ సంవత్సరాల నుంచి తక్కువ ఫీజులతో స్కూల్ నడుపుతున్నారు అన్నారు. స్కూల్ ఉపాధ్యాయులు, యస్.సుబ్బయ్య, రమణమ్మ, మల్లికార్జున, కొండారెడ్డి, శేషు పివి రెడ్డి, స్కూల్ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగసముద్రం పంచాయతీకి అవార్డు

ప్రజాశక్తి-కలిగిరి : మండలంలోని నాగసముద్రం గ్రామ పంచాయతీ జిల్లా క్లీన్ అండ్ గ్రీన్ అవార్డుకు ఎంపికైందని పంచాయతీ కార్యదర్శి, ఇఒపిఆర్డి వెలుగోటి మధు తెలిపారు. పంచాయతీలో ఎస్ డబ్ల్యుపిసి షెడ్ నిర్వహణ చేసి గ్రామంలో హరిత రాయబారుల ద్వారా చెత్త సేకరణ, దీనిద్వారా వర్మి కంపోస్టు ఎరువు తయారీ, పంచాయతీని పరిశుభ్రంగా చేయుచుండం వలన పంచాయతీ పాలకుల దగ్గరుండి నిర్వహించారు. రేపు నేషనల్ పంచాయతీరాజ్ డే సందర్భంగా క్లీన్ అండ్ గ్రీన్ విభాగంలో జిల్లాస్థాయి క్లీన్ అండ్ గ్రీన్ అవార్డుకు ఎంపికైంది. సర్పంచ్ డి.శ్రీనివాసులు, ఉపసర్పంచ్ ఎ.హజరత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

సందర్శకులపై తేనెటీగల దాడి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఉదయగిరి దుర్గం కొండను సందర్శించేందుకు వచ్చిన ఆత్మకూరు, ఎఎస్పేట, నెల్లూరుకు చెందిన వారిపై తేనెటీగలు దాడి చేశాయి. ఆదివారం స్థానిక దుర్గం కొండపై సందర్శకులు 15 మంది మిత్రులతో కలిసి వంట సామాగ్రితో దుర్గం కొండపైకి వెళ్లారు. కొండపై సమీపంలో వంట చేసేందుకు మంటలు వెలిగించగా తేనెటీగలు దాడి చేశాయి. పోలీసులకు 108 వాహనానికి సమాచారం అందించడంతో తేనెటీగల దాడిలో గాయపడిన పలువురిని పోలీస్ జీపు, 108 వాహనంలో వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సందర్శకుల్లో ఐదు మందిపై ఎక్కువ దాడి చేయగా అందులో తీవ్రంగా దాడి చేయగా ప్రథమ చికిత్స అనంతరం హుటా హుటిని ఆత్మకూరు తరలించారు.

'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-విడవలూరు : మండలంలోని ఊటుకూరు పంచాయతీలో ఆదివారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్రెడ్డి నిర్వహించారు. ఈ మేరకు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ద్వారా వారి కుటుంబాలకు అందుతున్న సంక్షేమ లబ్ది వివరాల కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకుడు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, రామిరెడ్డి విజయ భాస్కర్రెడ్డి, వంశీ రెడ్డి, నవీన్ రెడ్డి, పుంజ అమ్మర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు

కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్

ఇంటర్వ్యూ



ప్రజాశక్తి-నెల్లూరు

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు ప్రజలకు పారదర్శకంగా అందజేయాలన్న సంకల్పంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. నగరంలోని అన్ని డివిజన్ల వారీగా సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు వాలంటీర్లు, కార్యదర్శుల సేవలు ఏ తరహాలో ఉన్నాయో కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్ మాటల్లో...

ప్రశ్న.. సచివాలయల్లో పనిచేస్తున్న వాలంటీర్లు, కార్యదర్శులు విధి విధానాలు ఏమిటీ, డివిజన్ల పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వాలంటీర్ల, కార్యదర్శుల పనితీరు ఎలా ఉంది..?

జవాబు.. ప్రజా సంక్షేమం కోసం.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన వారందరికీ అందజేయాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రారంభించింది. వాలంటీర్లు, కార్యదర్శులు ఎటువంటి లాభాపేక్ష లేకుండా, అవినీతి అక్రమాలకు పాల్పడకుండా ప్రజా సంక్షేమం కోసం పనిచేసేందుకు ప్రభుత్వం నియమించింది. ఈ క్రమంలో జగనన్న కాలనీలు, టిడ్కో గృహాల పంపిణీ చేయడం, ముఖ్యంగా ప్రతినెలా మొదటి తేదిన వృద్ధులకు వారి ఇంటి వద్దకే వాలంటీర్లు వెళ్లి ప్రభుత్వం అందజేసే ఫించన్ అందజేయడం సజావుగా సాగుతుందన్నారు.

ప్రశ్న.. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నవరత్నాలు పథకంలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా జరగటం లేదని, మౌళిక వసతుల కల్పనలో సైతం అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. నిజమేనా..?

జవాబు. జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, మౌలిక వసతులను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎప్పటికప్పుడు అధికారులకు సూచిస్తున్నాం. జగనన్న ఇళ్ల నిర్మాణాల్లో అత్యంత నాణ్యమైన మెటీరియల్ను కాంట్రాక్టర్లు వినియోగించాలని, నిర్మాణ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రతిరోజు నివేదికలు అందజేయాలని ఆదేశించాం. ప్రభుత్వ విధులపై, పథకాల అమలులో అలసత్వం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటాం. జగనన్న ఇళ్ల నిర్మాణ పనుల పట్ల సంబంధిత అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేస్తే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న. మంజూరైన గృహాలకు రుణాలు ప్రక్రియ ఆలస్యంగా సాగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకు అధికారులు, మెప్మా అధికారులు అలసత్వం వహిస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు..?

జవాబు. అర్హులైన లబ్ధిదారులందరికీ బ్యాంకుల నుంచి త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలని ప్రతినిధులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.ఇప్పటికే 703 మంది లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేశారు. వీరందరికీ స్థలాల రిజిస్ట్రేషన్ పనులు పూర్తి చేసి విడతల వారీగా గృహాలను లబ్ధిదారులకు అంద జేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. లబ్ధిదారులందరికీ బ్యాంకు అధికారులు రుణాలు మంజూరు చేసి శాశ్వత గృహహక్కు పథకం వర్తింప చేయాలని సూచించామన్నారు. లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసే సమయంలో బ్యాంకు అధికారులు, మెప్మా అధికారులు ఎటువంటి ఇబ్బందులు కలుగ చేసిన తమ దృష్టికి తీసుకురావాలి.

ప్రశ్న. ప్లాస్టిక్ (క్యారీ బ్యాగులు) వినియోగం నగరంలో ఎక్కువగా ఉంది. వీటివల్ల పర్యావరణం పూర్తిగా దెబ్బతింటుంది. క్యారీ బ్యాగుల వినియోగం నియంత్రణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు. ప్లాస్టిక్ ఉత్పత్తులకు ప్రత్యామ్నాయాల వాడకం పెరిగినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. ప్లాస్టిక్, క్యారీ బ్యాగుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించి జౌళి సంచుల వాడకం అలవాటు చేసుకోవాలి. నగరంలో ఇప్పటికే 75 మైక్రోన్ల కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్, క్యారీ బ్యాగుల వినియోగంపై నిషేధం విధించాం. జులై 1వ తేది నుంచి నగరంలో ఒక్కసారి వినియోగించి వదిలేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ, అమ్మకం, కొనుగోలు నిషేధించాం. ప్లాస్టిక్ ఉత్పత్తులపై ప్రజలందరూ అవగాహన పెంచుకొని బాధ్యతాయుతంగా వ్యవహరించాలి.

ప్రశ్నిస్తే దాడులా..

ప్రజాశక్తి-కొడవలూరు

ఆటోస్టాండ్లో రౌడీ మామూళ్ల వసూలు చేయొద్దని ప్రశ్నిస్తే తమవారి పైనే దాడులు చేస్తారా అని డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతిరావు టిడిపి నాయకులను ప్రశ్నించారు. నార్తురాజుపాలెంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టిడిపి నాయకుల వైఖరిపై మండిపడ్డారు. నార్తురాజుపాలెం అనేక మండలాలకు కూడలి అయినందున వివిధ ప్రాంతాల నుంచి ఆటోలు వచ్చి స్టాండ్లో ప్రయాణికులను తరలిస్తుండడం షరా మామూలేనన్నారు. ఈ ఆటో స్టాండ్లో ఆటో వాళ్ల నుంచి టిడిపి నాయకులు రౌడీ మామూళ్లు వసూలు చేస్తుంటే గతంలో ఎస్ఐ, పంచాయతీ అధికారుల ద్వారా అడ్డుకోవడం జరిగిందన్నారు. అప్పటి నుంచి వసూళ్లకు విరామం ఇచ్చి మళ్లీ శనివారం నుంచి ఆ పార్టీ నాయకులు వసూళ్లు ఆరంభించారని తెలిపారు. ఈ విషయంపై సర్పంచ్ భర్త ప్రశ్నిస్తే ఆ పార్టీ అండతో దాడి చేశారని తెలిపారు. పైగా తనపైనే దాడి జరిగినట్లు ఎలాంటి గాయాలు లేకపోయినా కోవూరు ఆసుపత్రిలో చేరి బోగస్ కేసు పెట్టేందుకు ప్రయత్నించారని తెలిపారు. కోవూరు టిడిపి ఇన్ఛార్జి పోలంరెడ్డి దినేష్రెడ్డి స్థాయి మరచి అవగాహన లేని విమర్శలు చేయడం మానుకోవాలని చలపతిరావు హెచ్చరించారు. సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ గంధం వెంకట శేషయ్య, ఎంపిపి జి.జ్యోతి, సర్పంచ్ లు సుప్రియ, ఎం రమేష్, నవీన్, ఎంపిటిసి ఎం.కామేశ్వరి, నాయకులు కొండా శ్రీనివాసరెడ్డి, ఎన్ మాణిక్యరావు, పి మధుసూదన్ రెడ్డి, నీలకంఠం, శ్రీధర్ రెడ్డి, ఎండి కరిముల్లా, బచ్చు శ్రీనివాసులు, చెక్కా మనోహర్, కాకి శ్రీనివాసులు పాల్గొన్నారు.

రామసుబ్బారెడ్డి చిత్రపటం అందజేత

ప్రజాశక్తి-కావలి

జిల్లా సిఐటియు కార్యాలయానికి కామ్రేడ్ డి.రామ సుబ్బారెడ్డి చిత్రపటాన్ని ఆదివారం ఎన్.ఎఫ్.పి.ఇ. నాయ కులు అందజేశారు. పోరాటయోధుడు, సుదీర్ఘ కాలం తపాలా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి సల్పిన మహనీయుడు కామ్రేడ్ డి.రామసుబ్బారెడ్డి ఆయన చిత్రపటాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్కుమార్కు ఎన్ఎఫ్పిఇ సీనియర్ నాయకులు ఎ.వి.కృష్ణయ్య, పి4 కార్యదర్శి సిహెచ్.వెంకయ్య, చేతుల మీదుగా ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు రామసుబ్బారెడ్డి చిత్రపటం సిఐటియు కార్యాలయంలో ఉంచాలనే ఆశయం నేటితో నెరవేరిందన్నారు. తపాలా ఉద్యోగులకు సిఐటియు సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పి4 అధ్యక్షులు యు.పెంచలయ్య, బి.శ్రీనివాసులు, కె.శివనాగరాజు, ఎస్.వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నాయకులు

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-మర్రిపాడు

మర్రిపాడు మండల యుటిఎఫ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. యుటిఎఫ్ రాష్ట్ర, జిల్లా శాఖల ఆదేశాల మేరకు స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో మండల విస్తృత కార్యవర్గ సమావేశాన్ని యుటిఎఫ్ మాజీ మండలాధ్యక్షులు షేక్ ఖాజా రసూల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మోహన్ప్రసాద్ మాట్లాడుతూ పాత మండల కమిటీ ఈ ఏడాది చేసిన కృషి, ఉపాధ్యాయుల సమస్యలు, సామాజిక సమస్యలను వివరిస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ నూతన కమిటీ రాబోవు విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల, సామాజిక సమస్యలను పరిష్కరించు కుంటూ మండల శాఖను ముందుకు తీసుకెళ్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులుగా ఐ.భాస్కర్, యుటిఎఫ్ మండలాధ్యక్షులు ఎస్కె ఖాజారహంతుల్లా, అసోసియేట్ అధ్యక్షులుగా ఎస్.కె.దావూద్, అనూష, ప్రధాన కార్యదర్శి కే సుధాకర్, ట్రెజరర్ ఎస్.వెంకటయ్య, ఎఫ్డబ్ల్యూఎఫ్ కన్వీనర్ పి.నరహరి, మండల కార్యదర్శులు మునాఫ్, జానీ, కే వెంకటసుబ్బయ్య, ఆర్.మస్తాన్ రెడ్డి, ఎన్.వెంకటేశ్వర్లు, ఈ.రమేష్, జిల్లా కౌన్సిలర్లు గా పి.విజయ్ భాస్కర్ రెడ్డి, ఎస్కె ఖాజా రసూల్, పి ప్రమీల, జి సాంబశివారెడ్డి, యు తిరుపాలు, టి వెంగయ్య, మహిళా కార్యదర్శి బి అపర్ణ, హై స్కూల్ బాధ్యులు చాన్బాషా, ఆడిట్ కమిటీ కే రంగనాయకులను ఎన్నుకున్నారు. వృత్తిపై అంకిత భావముతో పనిచేసి ప్రభుత్వం నుండి అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. యుటిఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ జి.సుబ్బరాయుడు, నాయకులు నాయబ్ భాషా, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, సిపిఎం మండల కార్యదర్శి ఎస్డి రహంతుల్లా పాల్గొన్నారు.

ఉరుములు మెరుపులతో వర్షం

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండలంలో ఆదివారం రాత్రి ఉరుములు మెరుపులతో భీకర గాలితో వాతావరణం భయాందోళనకు గురిచేసింది. విపరీతమైన గాలివాన వల్ల విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. మండలంలోని 24 పంచాయతీల్లో ఈ పరిస్థితి ఏర్పడింది.

బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి : సిపిఎం



ప్రజాశక్తి- ఉదయగిరి

బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిరంకుశ విధానాలను అనుసరిస్తున్న ప్రధాని మోడీని ఇంటికి సాగనంపాలని సిపిఎం సిఐటియు రైతు సంఘం నాయకులు బస్టాండ్ సెంటర్ ప్రచారభేరి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి ఆదాయాన్ని తెస్తున్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ తన ఆశ్రిత పెట్టుబడీ దారులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్లే దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని దుయ్యబట్టారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గినప్పటికీ పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర విభజన సమయంలో ప్రజలకు చేసిన విభజన హామీలు అమలు చేయకుండా ఎపిని అధోగతి పాలు చేసిన ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన మతోన్మాద బిజెపిని సాగనంపుదాం.. దేశాన్ని కాపాడుకుందాం.. అంటూ నినాదాలు చేశారు. బిజెపి వ్యతిరేక విధానాలపై చేస్తున్న ఈ ఉద్యమానికి సహరించిన అన్ని రంగాల కార్మికులు ప్రజలకు ధన్యవాదాలు తెలిపి మండలంలో చేపట్టే కార్యక్రమం కు ప్రతి ఒక్కరు పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పర్దీన్ భాషా, ఎంపిటిసి కాకు విజయ, రైతు సంఘ నాయకులు కాకు వెంకటయ్య, సిఐటియు మండల అధ్యక్షులు కార్యదర్శి ఇ.తిరుపతయ్య, గడ్డం నాగేశ్వరరావు, కోడె రమణయ్య, మండల నాయకులు నాయబ్, పందిళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-విడవలూరు : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని, రానున్న ఎన్నికల్లో బిజెపి ఇంటికి సాగనంపాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు తుళ్లూరు గోపాల్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గ్రామాల్లో ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2020 సంవత్సరంలో మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు 13 నెలల పాటు పోరాడి పార్లమెంట్లో రద్దు చేయించారని తెలిపారు. అయినప్పటికీ రైతుకు మద్దతు ధర గ్యారెంటీ లేదని, వ్యవసాయ వ్యవసాయంలో కార్పొరేటీకరణ, వాణిజ్య వస్తువుల నిల్వలు పెంచుకునేందుకు అవకాశం ఈ ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి మోహన్, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



బుచ్చిలో... : కార్పొరేట్ ఆస్తులు పెంచేందుకు ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని సిపిఎం మండల కార్యదర్శి గండవరపు శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ప్రచార భేరి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను నష్టల్లోకి తీసుకువచ్చి వాటిని తన మిత్రులైన కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆగడాలను ప్రశ్నించే వారిపై తప్పుడు కేసులు పెట్టి సిబిఐను, ఈడీని ఉసి గొల్పుతున్నారన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రమాదకరంగా మారిన ఈ బిజెపి ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించి దేశాన్ని కాపాడాలన్నారు. రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ సంస్థలైన విశాఖ ఉక్కుని కర్మాగారాన్ని నష్టాల ఊబిలోకి తీసుకుని వచ్చి దాన్ని అమ్మేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో గరికపాటి సురేష్, వంజివాక కృష్ణ ప్రసాదు, పుత్తైటి మల్లికార్జున, కొరికల బుజయ్య, రాగి రమణయ్య, బెజవాడ మోహన్, మోడేగుంట బాబులు, సిహెచ్ వి.రత్తయ్య, రమేష్, పెంచలయ్య, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి-కావలి : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వామ పక్ష పార్టీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం సిపిఎం నాయకులు ఇస్లాం పేట, కొత్తమసీదు, సపోటతోట, ప్రాంతాలలో ప్రచారభేరి నిర్వహించారు. ఈ మేరకు కరపత్రాలు పంచుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ప్రజావ్యతిరేక నిరంకుశ మతోన్మాద విధానాలతో కేంద్రంలో పరిపాలిస్తున్న బిజెపిని వచ్చే ఎన్నికల్లో ఓడించాలన్నారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను బడా పారిశ్రామిక వ్యక్తులకు కట్టబెడుతూ అదాని, అంబానీ పరిపాలను కొనసాగిస్తూ పారిశ్రామిక వ్యక్తులకు లాభాలు చేకూరుస్తూ ప్రజలపై భారాలు మోపుతుందని విమర్శించారు. నరేంద్ర మోడీ బీజేపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఓడించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్కే అమీర్భాషా, ఎస్కే మహబ్ బాషా, ఎస్కే మస్తాన్, డివైఎఫ్ఐ నాయకులు ఎస్కే నాయబ్ రసూల్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులపై ఫిర్యాదు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట

కోవూరు ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని, వైసిపి నాయకులను కించపరిచేలా మాట్లాడి అవమానించిన టిడిపి నాయకులపై తగు చర్యలు తీసుకోవాలని ఇందుకూరుపేట వైసిపి నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆదివారం వైసిపి మండల అధ్యక్షులు మావులూరు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో మండల వైసిపి నాయకులు ఇందుకూరుపేట ఎస్ఐ రాజేష్కు ఫిర్యాదును అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇందుకూరు పేట టిడిపి నాయకులు కొందరు తమ వైసిపి నాయకులను, ఎంఎల్ఎ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని కించపరుస్తూ మాట్లాడడాన్ని వారు ఖండిస్తున్నామన్నారు. సంస్కారం లేని భాషను టిడిపి నాయకులు వాడారన్నారు. వెంటనే తమకు తమ నాయకులకు క్షమాపణ చెప్పాలన్నారు. కరోనా కష్టకాలంలో, వరదల సమయంలో నల్లపరెడ్డి సేవలు ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండే మనిషి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. అలాంటి నాయకుడిని కించపరిచేలా మాట్లాడిన టిడిపి నాయకులపై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై పరిష్కార దిశగా రాజకీయాలు ఉండాలే తప్ప నీచ రాజకీయాలు చేయకూడదన్నారు. ఇకపై తమ నాయకులపై, తమ పార్టీపై అవాక్కులు చవాక్కులు పేలుతే సహించబోయేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ చైర్మన్ గొల్లపల్లి విజయ్కుమార్ యాదవ్, జెడ్పి వైస్చైర్మన్ శ్రీహరికోట జయలక్ష్మి, రావూరు సర్పంచ్ ఉడతా వెంకట శేషయ్య, సీనియర్ నాయకులు గూడూరు ప్రభాకర్ రెడ్డి, దేవిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కైలాసం శ్రీనివాసులు రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఎస్కె దిల్షాద్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్తో 3 పూరిళ్లు దగ్ధం

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని తూర్పు గోగులపల్లి పంచాయతీ పరిధి గోపాలపురం వద్ద ఆదివారం షార్ట్ సర్క్యూట్తో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు గిరిజనుల ఇల్లు అగ్నికి ఆహుతయ్యాయి. వివరాల్లోకి వెళితే.. పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్లుగా విధులు నిర్వహించే బండి శేషయ్య, వేమయ్య వారి కుటుంబ సభ్యులు ఇంటిలో లేని సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుందని వెల్లడించారు. శనివారం సర్పంచ్ తోట మహాలక్ష్మి జీతం డబ్బులు రూ.18 వేలు ఇచ్చినట్లు తెలియజేశారు. ఇంట్లో ఉన్న నల్లపూసలు, టీవీలు, నిత్యావసర వస్తువులు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయని బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న వైసిపి నాయకులు తోట శ్రీనివాసులు, గోళ్ల ఆదాము సంఘటన స్థలానికి వెళ్లి బాధితులను ఓదార్చి మంటలను ఆర్పి వేశారు. సర్వం కోల్పోయిన బాధితులకు అన్ని విధాల సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

బాధిత గిరిజనులకు ఆర్థికసాయం

అల్లూరు : మండలంలోని తూర్పు గోగులపల్లి పంచాయతీ గోపాలపురంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్తో గిరిజనుల ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో సమాచారం తెలుసుకున్న నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ చైర్మన్, మండల వైసిపి ఎస్టిసెల్ అధ్యక్షులు దాసరి పోలయ్య బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.3వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో గ్రీన్ అంబా సిడర్లుగా విధులు నిర్వహించే వారిని తెలియజేశారు. కట్టుబట్టలతో గిరిజనులు రోడ్డు మీద పడ్డారని సంబంధిత విషయాన్ని కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్కుమార్రెడ్డి, తహశీల్దార్, ఐటిడిఎ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తానని హామీనిచ్చారు.

వేతనానికి తగ్గ పని కల్పించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

కరువు పనులలో ఉపాధి కూలీలు తమకు గిట్టుబాటు లేబర్ వేజ్ రోజుకు కనీసం రూ.271 తగ్గకుండా కూలీపని చేయాలని ఎంపిడిఒ సి.శ్రీనివాసులు తెలియజేశారు. ఆదివారం బట్టేపాడులో జరిగిన ఉపాధి హామీ పథకంలో జరిగిన ఉపాధి పనులను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధికూలీ లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం వారు రోజుకు రూ.271 తగ్గకుండా కూలీ డబ్బులు ఖర్చు చేయమన్నారన్నారు. తదుపరి మస్టర్లోని హాజరును పరిశీలించారు. వేసవి తీవ్రత అధికంగా ఉన్నందున షెల్టర్లును తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎ.పి.ఒ. శిరీషరెడ్డి, ఫీల్డ్అసిస్టెంట్లు రవితేజ ఉన్నారు.



ఘనంగా పోలేరమ్మ జాతర

ప్రజాశక్తి-సీతారామపురం

మండలంలోని ఓగూరువాండ్లపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ జాతరలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులందరూ ఆలయం వద్ద పొంగల్లు నిర్వహించి, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కత్తి వజ్జ, నృత్య కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఆయనవెంట వైసిపి నాయకులు యారవ మోహన్ రెడ్డి, యారవ భాస్కర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, సోడా చిన్న అల్లూరి రెడ్డి,పెద్ద అల్లూరు రెడ్డి, మాజీ సర్పంచ్ లు శ్రీనివాసులు, చంద్రమౌళి తదితులున్నారు.

2024లోనూ సిఎంగా జగన్మోహన్రెడ్డి

- రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి

ప్రజాశక్తి-సీతారామపురం

రాష్ట్రంలో మరోసారి జగనన్నే ముఖ్యమంత్రి అవుతాడని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి రెడ్డి జోస్యం చెప్పారు. ఆదివారం మండలంలోని ఓగూరు వాండ్లపల్లి గ్రామంలో జగనన్న నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. గ్రామంలో తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్థానిక నాయకులు యారవ మోహన్ రెడ్డి, యారవ భాస్కర్ రెడ్డిలు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎప్పుడు ఎన్నికలు జరిగినా రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం క్లీన్ స్వీప్ చేస్తుందని ఇటీవల టైమ్స్ నౌ సర్వే వెల్లడించిందని గతంలో కూడా టైమ్స్ నౌ సర్వే చెప్పిన విధంగానే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని ఆయన గుర్తు చేశారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని ప్రతిపేద కుటుంబానికి అందాయని 90 శాతం ప్రజలు వైసిపి ప్రభుత్వ పథకాల లబ్ధితో సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు వైసిపి ప్రభుత్వంపై ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని తామందరం సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెంటే ఉంటామని తెలుపుతున్నారన్నారు. అన్నిరంగాల్లో రాష్ట్రం ముందంజలో ఉందని పార్టీలకతీతంగా ప్రతి సంక్షేమ పథకం ప్రజలకు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి ప్రభుత్వం అన్నారు. గతంలో పింఛన్ కోసం ఎక్కడో ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని ప్రస్తుతం గ్రామ వాలంటీర్లు తమ వద్దకు వచ్చి పింఛన్ ఇస్తున్నారని అవ్వా తాతలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే పార్టీకి కొండంత అండను అందిస్తుందని, కాబట్టి రాష్ట్రంలో వైనాట్ 175 ఖచ్చితంగా జరగబోతుందన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో వైసిపి బలంగా ఉందని రాబోయే ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గంలో ఉదయగిరిలో వైసిపి జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. అయ్యవారిపల్లి సర్పంచ్ చింతనబోయిన దుర్గయ్య యాదవ్, నాయకులు యారవ మోహన్రెడ్డి, యారవ భాస్కర్ రెడ్డి, తిరుపతిరెడ్డి, శేఖర్ రెడ్డి, వెంగళరెడ్డి, రమణారెడ్డి, సోడా చిన్న అల్లూరు రెడ్డి, చిన్నపరెడ్డి, పెద్ద అల్లూరు రెడ్డి, ఒగూరు శ్రీనివాసులు, మాజీ సర్పంచులు చంద్రమౌళి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఓగూరువాండ్లపల్లిలో పర్యటిస్తున్న మెట్టుకూరు చిరంజీవి రెడ్డి